సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం ׀ 17 ׀ జూలై ׀ 2023



సొగసు చూడతరమా..!

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ అందాలు కనువిందు చేస్తున్నాయి. జలపాతాలు, కొండల్ని తాకుతున్న మేఘాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. 8లో



గోదావరి తగ్గుముఖం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూడు రోజులుగా వరద ప్రవాహంతో ఉధృతంగా ప్రవహించిన గోదావరి నది ఆదివారం కొద్దిగా శాంతించింది. 8లో



క్షీరారామంలో లీలా కల్యాణం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లీలా కల్యాణ్యాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి లక్ష ముత్యాలతో పూజాదికాలు జరిగాయి.

ముంగిటకే రిజిస్ట్రేషన్ సేవలు

- ఉమ్మడి జిల్లాలో 167 సచివాలయాల్లో సేవలు
- పారదర్శకంగా సేవలందించేలా ప్రభుత్వం చర్యలు
- టైమ్ స్లాట్ బుకింగ్ ద్వారా సమయం ఆదా
- నాలుగేళ్లలో మార్కెట్ విలువ పెంచింది ఒక్కసారే..



ఏలూరు (ఆర్ఆర్‌పేట): రిజిస్ట్రేషన్ సేవలను మరింత పారదర్శకంగా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వానికి అధిక ఆదాయం తీసుకువచ్చే వాటిల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి కాగా.. దీనిపై అవినీతి ఆరోపణలు ఆ స్థాయిలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అవినీతికి తావులేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం జగన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ల కోసం దూరంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కక్షిదారులు వెళ్లాల్సి వస్తుంది. అలాగే బ్యాంకుల్లో చలానాలు కట్టడం, స్టాంపులు కొనుగోలు చేయడం, దస్తావేజు తయారు చేయించుకోవడం వంటి పనులన్నీ వ్యయప్రయాసలతో కూడుకున్నవి. ఈ క్రమంలో ఒక రిజిస్ట్రేషన్ పూర్తయి దస్తావేజు పత్రాలు చేతికి రావాలంటే 10 నుంచి 15 రోజుల సమయం పడుతుంది. దీనివల్ల ప్రజలకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. ఈ పరిస్థితిని కూడా అధిగమించడం కోసం సీఎం జగన్ రిజిస్ట్రేషన్ సేవలను ప్రజల ముంగిటకే తీసుకువచ్చేలా ఏర్పాట్లుచేశారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు

రిజిస్ట్రేషన్ సేవలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో మరింత పారదర్శకతకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందించే సేవలపై ఆరోపణలు, అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో అన్ని కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ ప్రకటనల్ని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సచివాలయాల్లో 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా డేటా ఎంట్రీ విధానం ప్రవేశపెడుతున్నారు. టైమ్ స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా 20 నిమిషాల వ్యవధిలోనే సబ్ రిజిస్ట్రర్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. కేవలం రిజిస్ట్రేషన్లు మాత్రమే కాకుండా గ్రామ సచివాలయాల్లో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్స్, మార్కెట్ వాల్యూ ధ్రువీకరణ పత్రాల జారీ, వివాహాల రిజిస్ట్రేషన్లు సైతం చేయనున్నారు.

20 శాతం ప్రాంతాల్లోనే మార్కెట్ విలువ పెరిగింది

రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి మారుతున్న ధరలకు అనుగుణంగా గత ప్రభుత్వాలు మార్కెట్ విలువలను పెంచేవి. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత నాలుగేళ్లలో ఒక్కసారి మాత్రమే అది కూడా ఈ ఏడాది పెంచారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బహిరంగ మార్కెట్‌కు, రికార్డుల్లో ఉన్న ధరలకు భారీ వ్యత్యాసం ఉన్న 20 శాతం ప్రాంతాల్లో మాత్రమే మార్కెట్ విలువలను పెంచారు. అయితే గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్యకాలంలో మూడేళ్లు వరుసగా మార్కెట్ విలువను పెంచి ప్రజలపై భారం మోపారు. 2015లో 20 నుంచి 25 శాతం, 2016లో 15 నుంచి 20 శాతం, 2017లో 10 నుంచి 15 శాతం వరకు విలువలు పెరిగాయి.

ప్రైవేట్ భవనాల పాపమూ బాబుదే..

రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లోనే నిర్వహించాల్సిన దుస్థితి గత ప్రభుత్వాల హయాం నుంచే ఉంది. ఈ పాపంలో ఎక్కువ భాగం చంద్రబాబుదే అని రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల సంఘాల నాయకులు, దస్తావేజుల లేఖరులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యధిక కాలం చంద్రబాబు పాలన కొనసాగినా రిజిస్ట్రేషన్ శాఖ అవసరాలు గుర్తించడంలో, వాటికి సొంత భవనాలు నిర్మించడాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖకు అత్యధిక ఆదాయం వచ్చినా సక్రమంగా వినియోగించకపోవడం కారణంగానే ఇప్పటికీ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు.

167 సచివాలయాల్లో ఏర్పాట్లు

ఏలూరు జిల్లాలో 12, పశ్చిమగోదావరి జిల్లాలో 16 రిజిస్ట్రేషన్ కార్యాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలుత ఏలూరు జిల్లాలో 78, పశ్చిమగోదావరి జిల్లాలో 16 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించారు. అనంతరం రెండో విడతగా ఏలూరు జిల్లాలో మరో 55, పశ్చిమగోదావరి జిల్లాలో 18 సచివాలయాల్లో కలిపి మొత్తం 167 సచివాలయాల్లో ప్రస్తుతం రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

పారదర్శకంగా సేవలు



రిజిస్ట్రేషన్ సేవలు అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల సేవలు అందించడానికి చర్యలు తీసుకున్నాం. దీనికి సంబంధించి మా శాఖ సిబ్బంది అందరికీ తగు ఆదేశాలు జారీ చేశాం. అలాగే కక్షిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. స్టాంప్ పేపర్ల కొరతను అధిగమించడానికి ఈ స్టాంపింగ్ సౌకర్యాన్ని కక్షిదారులు వినియోగించుకోవచ్చు. మధ్యవర్తుల మాట విని ఎవరూ నష్టపోకూడదు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో మా సిబ్బందికి పని ఒత్తిడి తగ్గుతుంది.

– కె.అబ్రహం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ, ఏలూరు

ప్యాచీలు పడిన ట్యూబు చంద్రబాబు

- రాష్ట్రంలో బాబును నమ్మే పరిస్థితి లేదు
- రోజుకోవిధంగా పవన్‌కళ్యాణ్ మాటలు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: ప్యాచీలు పడిన ట్యూబు చంద్రబాబు అని, దానికి గాలి ఊదాలని కొంతమంది పత్రికాధిపతులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదని, ఎంత గాలి ఊదినా ఆగడం లేదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కిలో బంగారం, ఒక బెంజ్ కారు ఇస్తామన్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. జగన్ పాలనలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రతిపక్షాలు భిన్నమైన ఆలోచనతో ఉన్నాయన్నారు. చంద్రబాబు దుర్మార్గాలకు అంతు లేదని, ప్రజల్ని బలిచేయాలని చూస్తున్నారని విమర్శించారు. పచ్చమీడియా సైతం రోజూ ప్రభుత్వంపై టన్నుల కొద్దీ విషం చిమ్ముతుందన్నారు. చంద్రబాబు సీఎం అయితే బాగుంటుందనుకునే దౌర్భాగ్యానికి పచ్చమీడియా దిగజారిపోయిందన్నారు. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతుంటే చూడలేకపోతున్నారని విమర్శించారు. చంద్రబాబు ఆలోచన కూడా అలాగే ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే పవన్ కళ్యాణ్ రోజుకో విధంగా మాట్లాడుతున్నాడని, రాష్ట్రంలో బెల్టు షాపులు ఎక్కువయ్యాయని ఆరోపణలు చేస్తున్నాడన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో 45 వేల బెల్టు షాపులను రద్దు చేశారని మంత్రి గుర్తుచేశారు. మద్యాన్ని దూరం చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ ముందుకెళ్తున్నారన్నారు. నిన్న భూమ్ భూమ్ కంటే ఎక్కువ.. ఆంధ్రా గోల్డ్ కంటే తక్కువ అన్న వ్యక్తి నేడు తాగినోళ్లకు తాగినంత మద్యాన్ని అందిస్తామనడం పవన్ మతి చాంచల్యానికి నిదర్శనమన్నారు. ఎవరో రాసిచ్చిన దానిని చదివితే ఎక్కడోక్కడ దొరికిపోతాడని మంత్రి కొట్టు అన్నారు. పవన్‌కళ్యాణ్ రోజుకు రూ.2 కోట్ల కాల్‌షీట్ తీసుకుంటున్నాడని విమర్శించారు. అదనంగా చంద్రబాబుకు ట్యాక్స్ వేస్తున్నాడని అన్నారు. ఈనెల 18న ఢిల్లీలో జరగనున్న ఎన్డీయే సమావేశానికి పవన్‌కు ఆహ్వానం వచ్చిందని, చంద్రబాబు ఆహ్వానం కోసం ఎదురుచూస్తున్నాడని మంత్రి కొట్టు ఎద్దేవా చేశారు.

రాట్నాలమ్మా.. నమోనమః

అమ్మవారికి ఆషాఢ సారె





ఆలయంలో సారె సమర్పిస్తున్న భక్తులు , ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదవేగి: సిరుల తల్లి.. కల్పవల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం.. రాట్నాలమ్మ వారికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ఆదివారం రాట్నాలకుంటలోని అమ్మవారి ఆలయానికి రాయన్నపాలెం, రాట్నాలకుంట, కొండలరావుపాలెం గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేయించారు. మేళతాళాల నడుమ సారెను తీసుకువచ్చిన భక్తులకు దేవస్థాన సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు. ఆలయానికి ఒక్కరోజు ఆదాయం పూజా టికెట్లపై రూ.45,410, విరాళాల రూపంలో రూ.10,426, లడ్డూ విక్రయాల ద్వారా రూ.27,300, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,980 మొత్తంగా రూ.85,116 సమకూరినట్టు ఆలయ ఈఓ ఎన్.సతీష్ తెలిపారు. దేవస్థానం చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమృద్ధిగా ఎరువులు

సజావుగా సేద్యం

- జిల్లాలో 2.45 లక్షల ఎకరాల్లో వరి సాగు
- అందుబాటులో అన్నిరకాల ఎరువులు
- 53,675 టన్నులు అవసరం
- ఇప్పటికే 33,110 టన్నులు సిద్ధం



అత్తిలి మండలం కంచుమర్రు ఆర్‌బీకేలో సిద్ధం చేసిన ఎరువులు

ఎరువుల ధరలు ఇలా..

ఎరువు కాంప్లెక్స్	బస్తా (50 కిలోలు)
20–20–0	రూ.1,350
10–26–26	రూ.1,462
14–35–14	రూ.1,500
28–28–0	రూ.1,500
యూరియా	రూ.266.50
డీఏపీ	రూ.1,350

భీమవరం (ప్రకాశంచౌక్): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం వ్యవసాయానికి అన్నింటా అండగా నిలుస్తోంది. విత్తు నుంచి పంట విక్రయాల వరకు తోడుగా ఉంటూ వ్యవసాయాన్ని పండుగ చేస్తోంది. దీనిలో భాగంగా సకాలంలో కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో జిల్లావ్యాప్తంగా రైతులు సార్వా పనులు ముమ్మరం చేశారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు ఎరువులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభించగా మిగిలిన ప్రాంతాల్లో నారుమడుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంగా సార్వా సాగుకు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే 33,110 టన్నుల ఎరువులను రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, డీలర్ల వద్ద సిద్ధం చేశారు. జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.45 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా సుమారు 53,675 టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా.



కొమరాడ ఆర్‌బీకేలో ఎరువులు విక్రయిస్తున్న దృశ్యం

తక్కువ ధరలకే..

సార్వా సాగుకు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను ఆర్బీకేల ద్వారా విక్రయించడంతో రైతులు పెద్ద సంఖ్యలో తీసుకుంటున్నారు. గతంలో ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఎరువులను ధరలు పెంచి విక్రయించే వారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేకుండా తక్కువ ధరలకే ఎరువులను ప్రభుత్వం అందిస్తోంది. ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు రైతులకు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రైతు భరోసా కేంద్రాల్లో..

జిల్లాలో 387 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఉండగా వాటిలో కాంప్లెక్స్, యూరియా నిల్వలు 2,424 టన్నులు ఉన్నాయి. కాంప్లెక్స్ ఎరువులు 321 టన్నులు, యూరియా 2,103 టన్నులు అందుబాటులో ఉన్నాయి.

సొసైటీల్లో..

జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సొసైటీ)ల్లో 7,250 టన్నుల ఎరువులు నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. అందులో యూరియా 5,120 టన్నులు, కాంప్లెక్సు 2,130 టన్నులు ఉన్నాయి. ప్రైవేట్ వ్యాపారుల వద్ద మొత్తం 13,338 టన్నుల నిల్వలు ఉండగా అందులో యూరియా 8,558 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4,780 టన్నులు ఉన్నాయి.

మార్క్‌ఫెడ్‌లో..

మార్క్‌ఫెడ్‌లో 7,016 టన్నుల నిల్వలు ఉండగా వాటిలో యూరియా 4,962 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2,054 టన్నులు ఉన్నాయి.

త్వరలో మరిన్ని ఎరువులు



సార్వా సాగులో రైతులకు అవసరమైన ఎరువులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయి. ఆర్‌బీకే, సొసైటీల్లో వీటిని విక్రయిస్తున్నారు. సార్వా సాగుకు జిల్లాలో మొత్తం 53,675 టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసి ఇప్పటికే ఆర్‌బీకే, సొసైటీలు, డీలర్ల వద్ద 33,110 టన్నులు సిద్ధం చేశాం. మిగిలిన ఎరువులు కూడా త్వరలోనే వస్తాయి. రైతులు ఎక్కువ మోతాదులో ఎరువులు వాడకుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు కృషిచేయాలి.

–జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ, భీమవరం

'జగనన్నకు చెబుదాం'లో అర్జీల పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): జగనన్నకు చెబుదాం కార్యక్రమం (జేకేసీ) ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పూర్తి చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జేకేసీ ద్వారా గతనెల 9 నుంచి ఇప్పటివరకు 4,932 అర్జీలు రాగా 3,685 పరిష్కరించినట్టు పేర్కొన్నారు. మిగిలిన 919 అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. జేకేసీ ద్వారా ఎక్కువగా ఎలక్ట్రిసిటీ లోవోల్టేజ్, ఆర్ఓఆర్, పోలీస్, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై అర్జీలు వస్తున్నాయని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారమైన తర్వాత అర్జీదారునికి ఫోన్ చేసి సమస్య పరిష్కారం విధానంపై కూడా వివరాలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందకపోతే రీ ఓపెన్ చేసి అర్జీని సమీక్షిస్తున్నామని, అర్జీదారునికి మేలైన పరిష్కారం చూపడంలో సంబంధిత శాఖల అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడమే జేకేసీ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆకివీడు హైస్కూల్ పీఈటీ సస్పెన్షన్

ఆకివీడు: ఆకివీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ)గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆడపిల్లల పట్ల పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నందుకు గాను కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. పీఈటీపై పోక్సో కేసు నమోదు చేశారని చెప్పారు.

న్యూస్‌రీల్

'దుఃఖ నదులు'కు ద్వితీయ బహుమతి



కవి మామిడిశెట్టిని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు సెంట్రల్ : బిచ్చగాళ్లుగా, బాలకార్మికులుగా ఆప్యాయత, అనురాగాలకు నోచుకోని అనాథ బాలల అవస్థలపై కవి మామిడిశెట్టి శ్రీనివాసరావు రచించిన 'దుఃఖ నదులు' కవితకు జాతీయస్థాయి కవితల పోటీల్లో ద్వితీయ బహుమతి లభించింది. హైదరాబాద్‌కి చెందిన కొసరాజు అర్థి అండ్ జాహ్నవి మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన పోటీల్లో ఉభయ రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొన్నారు. హైదరాబాద్ అలకాపురిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షుడు కొలకలూరి ఇనాక్ తదితరుల చేతులమీదుగా తాను అవార్డు అందుకున్నట్టు శ్రీనివాసరావు ఆదివారం ఇక్కడ విలేకరులు తెలిపారు. ఆయన్ను ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు, ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు గుడాల హరిబాబు తదితరులు అభినందించారు.

ఈరంకికి సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఈరంకి కాశీ విశ్వనాథం

పాలకొల్లు సెంట్రల్ : పట్టణానికి చెందిన పురోహితులు ఈరంకి కాశీ విశ్వనాథం నంది, పురోహిత సేవా పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందించిన సేవా మూర్తులకు నంది పురస్కారాలు అందించారు. పురోహిత సంఘంలో సేవలకు గాను తాను ఈ పురస్కారాలు అందుకున్నట్టు కాశీ తెలిపారు. తాను చేసిన సేవలకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ భవన నిర్మాణాలు వేగిరపర్చాలి

ఇంజనీర్ ఇన్‌చీఫ్ బాలునాయక్



శివదేవునిచిక్కాలలో పనులను పరిశీలిస్తున్న బాలునాయక్

పాలకొల్లు అర్బన్: సచివాలయ భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్‌చీఫ్ బి.బాలునాయక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని శివదేవునిచిక్కాలలో రూ.79.50 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ భవనాలను ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇప్పటికే రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం పూర్తి కాగా సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని నిర్మిస్తున్న అన్ని సచివాలయ భవనాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆయన సూచించారు. పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. శివదేవునిచిక్కాలలో జరుగుతున్న పనుల తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పీఆర్ ఈఈ ఎస్ఎస్ఎస్ శ్రీనివాసరావు, డీఈఈ డి.సత్యనారాయణ, ఏఈ కె.శామ్యూల్, సర్పంచ్ దిడ్ల మణివజ్రం, దిడ్ల కృష్ణమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తేజస్విని ఉన్నారు.

శాలివాహనుల సంక్షేమానికి కృషి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో అర్హులైన కుమ్మరి, శాలివాహన కుటుంబాలకు నవరత్నాల కార్యక్రమం కింద సంక్షేమ పథకాలు అందిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శాలివాహన, కుమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎం.పురుషోత్తం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా లోని కుమ్మరి, శాలివాహన కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పురుషోత్తం మాట్లాడుతూ శాలివాహన, కుమ్మరి కుటుంబాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేశారని, మొల్ల జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు టౌన్‌: ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తోన్న ఒక వ్యక్తి తెల్లవారేసరికి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు గ్రామానికి చెందిన కర్నాటి శివన్నారాయణ (52)కు భార్య, కుమారుడు ఉన్నారు. శివన్నారాయణ ఏలూరు సత్రంపాడు శిరిడీనగర్‌లో ఒక గది అద్దెకు తీసుకుని ఉంటూ మ్యారేజ్‌ బ్యూరో నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి తన గదికి వెళ్ళి నిద్రపోయాడు. ఆదివారం ఉదయానికి అతను మరణించడంతో స్థానికులు ఏలూరు త్రీటౌన్‌ పోలీసులకు సమాచారం ఇచ్చారు. త్రీటౌన్‌ సీఐ కే.శివాజీ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ జాన్సన్‌ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌ మార్చురీకి తరలించారు.

ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో చోరీ

ఏలూరు టౌన్‌: ఏలూరు నగరంలోని శనివారపుపేట రోడ్డు శ్రీరామ్‌నగర్‌ 12వ రోడ్డులోని ఒక ఇంటిలో చోరీ జరిగింది. శ్రీరామ్‌నగర్‌లో ఉంటోన్న కమతం వెంకట వంశీకృష్ణ ఈనెల 15 తేదీ రాత్రి ఇంటికి తాళాలు వేసి వ్యక్తిగత పనులపై వేరే గ్రామానికి వెళ్ళారు. ఆయన తిరిగి శనివారం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోని రూ.20 వేల నగదు, విలువైన వాచీ, 100 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఇంటి యజమాని వంశీకృష్ణ ఏలూరు త్రీటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కే.శివాజీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటికి క్లూస్‌ టీమ్‌ వెళ్ళి ఆధారాలు సేకరించారు.

సొగసు చూడతరమా..!

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ అందాలు కనువిందు చేస్తున్నాయి. జలపాతాలు, కొండల్ని తాకుతున్న మేఘాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు మనసు దోచుకుంటున్నాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండ ప్రాంతంలోని జలపాతాలు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన ముంజులూరు సమీపంలోని జలపాతం, కన్నారపాడు సమీపంలోని జలపాతం, పాపికొండల అభయారణ్యంలోని ఉన్న జలతారు వాగు, గుబ్బల మంగమ్మ తల్లి సన్నిధిలోని జలపాతాలు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. పచ్చని చీర కప్పుకున్నట్లుగా అడవితల్లి అందం అడుగడుగునా తొణికిసలాడుతుంది. పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకు, దొరమామిడి నుంచి గుళ్లపూడి, వీరమద్దిగూడెం పచ్చని అడవి కట్టిపడేస్తుంది. ముంజులూరు వెళ్లే రహదారిలో జారుడు కాల్వ అడవితల్లి ఒడి నుంచి ఎవహిస్తూ అందంగా కనిపిస్తుంది. అలివేరు డ్యామ్‌ చుట్టూ పచ్చని కొండల అందాలు, పాపి కొండల సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కాటేజీల అద్భుత దృశ్యాలు చూసి తీరాల్సిందే.

- బుట్టాయగూడెం



ముంజులూరు సమీపంలో ఉన్న ఏనుగుతోగు జలపాతం



కన్నారప్పాడు వెళ్ళే మార్గంలోని పచ్చని అటవీప్రాంతం



పాపికొండల అభయారణ్యంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న జలతారు వాగు



బుట్టాయగూడెం మండలం అలివేరు సమీపంలో కొండలపై మేఘాలు కమ్మిన దృశ్యం

పంచాయతీ రికార్డుల స్వాధీనం

దెందులూరు: దెందులూరు పంచాయితీలో నిధులు దుర్వినియోగం, స్పందనలో గ్రామానికి చెందిన చిలికి శేఖర్‌ ఫిర్యాదుపై కలెక్టర్‌ ఆదేశాల మేరకు పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం విచారణాధికారి డీఎల్‌పీఓ పూర్ణచంద్రశేఖర్‌ మాట్లాడుతూ ఇటీవల ఇచ్చిన ఫిర్యాదును విచారించకుండా అధికారులు క్లోజ్‌ చేయడం, దానిపై ఫిర్యాదుదారుడు మళ్ళీ రీఓపెన్‌ చేయించడంతో విచారణలో భాగంగా రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నామన్నారు. వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక కలెక్టర్‌కు అందచేస్తామన్నారు. పంచాయితీల్లో నిధులు దుర్వినియోగానికి సంబంధించి డివిజన్‌లోని అన్ని ఈఓపీఆర్‌డీలకు లేఖ పంపామన్నారు. తరచూ పంచాయతీలో జరుగుతున్న పనులు, వాటికి చెల్లిస్తున్న నగదు, ఎవరు చెల్లిస్తున్నారు.. ఎలా చెల్లిస్తున్నారు.. ఎవరి అకౌంట్లకు చెల్లిస్తున్నారు.. వంటి వాటిపై సీరియస్‌గా తీసుకుని అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్‌: మండలంలోని బంగారుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కిటకిటలాడిన ఆలయాలు

ఆకివీడు: ఆషాఢ మాస ఆదివారం, మాస శివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు సారె(బోణాలు)ను మహిళలు సమర్పించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబను కూరగాయలతో అలంకరించారు. గీతా మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పిల్లలమర్రి అగ్రహారంలో పార్వతీ సమేత వేంకట లింగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి, స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. గంగానమ్మకోడు వీధిలోని మారెమ్మ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా బోణాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూలాభిషేకం చేశారు.

రెడ్డిగణపవరంలో ఘనంగా బోనాల పండుగ

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు పూనకాలతో, డప్పు దరువులతో నృత్యాలు చేస్తూ బోనాలు ఎత్తుకుని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా కనకదుర్గమ్మ అమ్మవారిని మల్లెపూలతో అలంకరించారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి సన్నిధిలో నృత్యాలు చేసి అనంతరం బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ప్రసాద వితరణతో పాటు అన్నసంతర్పణ కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించారు. అమ్మవారి భక్తులు కౌసల్య, దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున భారీ వర్షం కురిసి కొండవాగులు కొద్దిసేపు ప్రవహించి శాంతించాయి. దీనితో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఖమ్మం, విజయవాడ నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



బుట్టాయగూడెం : రెడ్డిగణపవరంలో నెత్తిన బోనాలతో ఊరేగుతున్న భక్తులు



ఆకివీడు : భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించిన మహిళలు



ఆకివీడు : గంగానమ్మ కోడు ప్రాంతంలోని మారెమ్మకు బోణాలు సమర్పించిన భక్తులు

వంతెన అప్రోచ్‌పై నుంచి వ్యాన్‌ బోల్తా

భీమవరం అర్బన్‌: భీమవరం మండలంలోని రామాయణపురం గ్రామంలో ఆదివారం ఉదయం యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన అప్రోచ్‌పై నుంచి వ్యాన్‌ బోల్తా పడి పక్కనే ఉన్న పంటకాలువలో పడింది. వంతెన ఇరువైపులా అప్రోచ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. వ్యాన్‌ డ్రైవర్‌ అప్రమత్తమై వెంటనే బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. గొల్లవానితిప్ప నుంచి యనమదుర్రు డ్రెయిన్‌ ఆవలివైపు ఉన్న రామాయణపురం దగ్గరి మార్గం కావడంతో ఈ వంతెనపై నుంచే వాహనాలు వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గత నాలుగు రోజుల క్రితం 11 మంది కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడటంతో స్థానికులు స్పందించి వెంటనే ఆటోలో ఉన్న కూలీలను బయటకు లాగడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఆ విషయం మరువక ముందే వ్యాన్‌ బోల్తా పడటంతో స్థానికులు, వాహనదారులు అప్రోచ్‌లు లేని వంతెనపై వాహనాలు రాకపోకలు సాగించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.



పంటకాలువలో బోల్తా పడిన వ్యాన్‌

ఆటపాక కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద బోటు షికారు చేస్తున్న పర్యాటకులు



పక్షుల కేంద్రం వద్ద చిల్డ్రన్స్‌ పార్కులో పర్యాటకుల సందడి

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వందలాది పక్షి ప్రేమికులు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. బోటు షికారు చేస్తూ పెలికాన్‌ పక్షుల కేరింతలను ఆస్వాదించారు. అనంతరం పక్షి నమూనా మ్యూజియంను ఆసక్తిగా తిలకించారు. అటవీశాఖ సిబ్బంది కొల్లేరు భౌగోళిక పరిస్థితులు, వలస పక్షుల విశేషాలను వారికి వివరించారు. మ్యూజియం సమీపంలో చిల్డ్రన్స్‌ పార్క్‌లో చిన్నారులు సందడి చేశారు.

గంజాయి పట్టివేత



కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో గంజాయి, నిందితుడితో కొయ్యలగూడెం పోలీసులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం పోలీసులు ఆదివారం గంజాయి పట్టుకున్నారు. లారీలో తరలిస్తున్న 23.6 కేజీల గంజాయిని పట్టుకుని, లారీని సీజ్‌ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి రవాణాపై తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం కొయ్యలగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. పోలవరం డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, సీఐ విజయ్‌కుమార్‌ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ తనిఖీల్లో అక్రమంగా లారీలో గంజాయిని తరలించడాన్ని గుర్తించామన్నారు. దీంతో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీచేయగా, 23.6 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.47వేలు ఉంటుందని ఆయన తెలిపారు.

బాస్కెట్‌బాల్‌ జట్టు ఎంపిక పూర్తి

ఏలూరు రూరల్‌: ఆదివారం ఏలూరు బాలికల పాఠశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సబ్‌జూనియర్‌ బాలికల బాస్కెట్‌బాల్‌ జట్టును ఎంపిక చేశామని బాస్కెట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు తెలిపారు. పి.నందిని, వై.విజయసారిక, ఎస్‌.పూజిత, సీహెచ్‌ కీర్తి, ఎస్‌.తన్మయిసాయి, ఏ.కేశవి, పి.దుర్గాభవాని, జి.రమణి, సీహెచ్‌ జ్యోతిసాయి, జి.రత్నహారిక, సీహెచ్‌ శ్రీజననితో పాటు ఎం.యోగశ్రీ, కె.పూజిత, ఎం.ప్రణతి, జి.క్రాంతి అపూర్వను స్టాండ్‌బై క్రీడాకారిణిలుగా ఎంపిక చేశామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో కలెక్టరేట్‌ ఉద్యోగి మృతి

నూజివీడు: మండలంలోని తుక్కులూరు వద్ద శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు కలెక్టరేట్‌లో సీనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తోన్న గూడపల్లి సాయినాథ్‌(34) మృతిచెందాడు. పట్టణానికి చెందిన సాయినాథ్‌ కలెక్టరేట్‌లో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ ఆటోను కూడా ఢీకొనడంతో ఆటోను నడుపుతున్న తమ్మిశెట్టి రాంబాబుకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. లారీని ఆపకుండా వెళ్తుండగా తుక్కులూరు గ్రామస్థులు వెంబడించి రూరల్‌ పోలీసులకు సమాచారమందించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని రూరల్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏడేళ్ల క్రితం ఉద్యోగంలో చేరిన సాయినాథ్‌ ఇటీవల వరకు నూజివీడు తహసీల్దార్‌ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌, ఆర్‌ఐగా విధులు నిర్వహించారు. రూరల్‌ ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి లారీ డ్రైవర్‌ పావులూరి శ్రీనివాసరావు అతిగా మద్యం సేవించి లారీని నడపడమే కారణమని డీఎస్పీ అశోక్‌ కుమార్‌గౌడ్‌ తెలిపారు. డ్రైవర్‌ది పెదపాడు మండలం అప్పనవీడని, కేసు నమోదు చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టుకు పంపించినట్లు తెలిపారు.



మృతుడు గూడపల్లి సాయినాథ్‌


బీచ్‌కు తరలివచ్చిన సందర్శకులు



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి చల్లని మబ్బులతో వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. పర్యాటకుల రాకతో బీచ్‌ రోడ్డు కిటకిటలాడింది. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వెంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి



కుక్కునూరు వద్ద గోదావరి వరద

కుక్కునూరు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గత రెండు, మూడు రోజులుగా గోదావరికి వరద ప్రవాహం పెరిగి మళ్లీ తగ్గుముఖం పట్టింది. ఎగువన కురిసిన వర్షాల కారణంగా తాలిపేరు, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులకు వరద నీరు చేరడంతో తెలంగాణ అధికారులు ప్రాజెక్టు నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో గత మూడు రోజుల క్రితం భద్రాచలం వద్ద 3 అడుగుల నుంచి ప్రారంభమై శనివారం వరకు 19 అడుగులకు వరద ప్రవాహం పెరుగుతూ వచ్చింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ప్రవాహం తగ్గి ఆదివారం మళ్లీ 18 అడుగులకు చేరింది. సోమవారానికి వరద ప్రవాహం మరింత తగ్గనున్నట్టు అధికారులు తెలిపారు.

శాకంబరి అలంకరణలో దానేశ్వరి అమ్మవారు



తణుకు రూరల్‌ మండలం దువ్వలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారిని ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా శాకంబరి అవతారంలో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్లను అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్‌ అడ్డా బాబు, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. -తణుకు టౌన్‌

క్లుప్తంగా

రెడ్డి సేవా సంఘం సమావేశం



అయితంపూడిలో సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేస్తున్న దృశ్యం

ఇరగవరం: అయితంపూడిలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినట్టు సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి రామచంద్రరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం తరుపున చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించామని తెలిపారు. అనంతరం ఆల్ ఇండియా జేఈఈ అడ్వాన్స్‌లో 38వ ర్యాంకు సాధించిన వెలగల ధీరాజ్ సాత్విక్ రెడ్డిని రెడ్డిని, సంఘం పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి వేణుగోపాల రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, సత్తి అజయ్ రెడ్డి, కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి (బాబు), భీమారెడ్డి, తమనంపూడి వెంకట్ రెడ్డి, పప్పు సత్యనారాయణ, పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే



గుంటూరులో మంత్రి మేరుగ నాగార్జునను సత్కరిస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన అన్ని హామీలను రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన నాటి నుంచే నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. గుంటూరులో ఆదివారం ఉదయం మంగరాజు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు మేరుగ నాగార్జునను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి, వినతిపత్రం సమర్పించారు. ఎస్సీలు మొదటి నుంచి వైఎస్సార్ సీపీకే మద్దతుగా ఉన్నారని, ఉంటారని, వైఎస్సార్ సీపీ విజయం కోసం ఎనలేని కృషి చేస్తామని వివరించారు.

నేడు వీరంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజలకు నవరత్నా పథకాల గురించి వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వలంటీర్లు.. నిస్వార్థ సేవకులు

ప్రభుత్వ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం. ప్రజలకు ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించడంతోపాటు అర్హత ఉన్న వారికి అవసరమైన పథకాలు అందించేందుకు దరఖాస్తులు పూర్తి చేయడంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలు సమకూర్చడం, వాటిని సచివాలయానికి అందించడం తదితర సేవలు వలంటీర్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ఆపత్కాల సమయంలో వలంటీర్లు ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబ సభ్యుల మాదిరిగా నిస్వార్థంగా సేవలందించడంతో అందరి అభినందనలు అందుకుంటున్నారు. – తాడేపల్లిగూడెం రూరల్

వలంటీర్లకు వందనం

పథకాలు ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు



ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఏ విధంగా పొందాలో తెలియకపోయినా తమ వద్దకు వచ్చి పథకానికి అవసరమైన పత్రాలను తీసుకెళ్లి వలంటీర్లే దరఖాస్తు చేస్తున్నారు. దీంతో ఇంటి నుంచి కదలకుండానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయి.

– వంజరపు శ్రీకరుణ, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం

అర్హత సమయం రాగానే దరఖాస్తు



ప్రతి ఒక్కరికీ వారి వయస్సు ఆధారంగా ఏ పథకాలు వర్తిస్తాయి, వంటి విషయాలు తెలుసుకుని ఫలానా పథకానికి మీరు అర్హులు అంటూ వారే దరఖాస్తు చేసి, బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని నేరుగా బ్యాంకు ఖాతాలకు జమయ్యేలా చూస్తున్నారు.

– తాతాల శ్రీలక్ష్మీ పుష్పవతి, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం

దివ్యాంగులకు అండగా నిలుస్తున్నారు



నేను ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. గతంలో పింఛన్ కోసం ఎన్నో పడిగాపులు పడేదాన్ని. ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్ అందించడం సంతోషంగా ఉంది. వలంటీర్లు దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ఎనలేనివి

– కట్టా సత్యవతి, వికలాంగురాలు, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

యువతకు ఉపాధి



రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాలను నేరుగా వారి ద్వారానే అందించడం అభినందనీయం. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఈ విధంగా జరగలేదు. తమకెంతో ఆనందంగా ఉంది. వలంటీర్ల సేవలు ప్రశంసనీయం.

– పొలుపూరి ధనలక్ష్మి, ఇటుకులగుంట, తాడేపల్లిగూడెం మండలం

పథకం లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాకు జమ



రాష్ట్ర ప్రభుత్వం ఆటోవాలాలకు ప్రవేశపెట్టిన వాహన మిత్ర పథకానికి వలంటీర్ సహకారంతో దరఖాస్తు చేశాను. ఆటో మా కుటుంబానికి జీవనాధారం. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వాహన మిత్ర పథకం సొమ్మును నేరుగా బ్యాంకు ఖాతాకు జమ చేశారు.

–సింగం మహాలక్ష్మి, ఇందిరమ్మ కాలనీ, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం

ఆరోగ్య శ్రీలో గుండె ఆపరేషన్ చేయించారు



మా వలంటీర్ జువ్వల రమ్య ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు అందించేవారు. ఆరోగ్య శ్రీ పథకంలో గుండె ఆపరేషన్ కోసం అవసరమైన పనులన్నీ దగ్గరుండి చేశారు. మాకు ఇంటి స్థలం, రుణ మాఫీ, వంటి పథకాలకు సంబంధించి అన్ని పనులు మా వలంటీరే చేశారు. మాకు శ్రమ లేకుండా పథకాలు అందేలా చేశారు.

– కోనాల సత్యనారాయణ, మండపాక, తణుకు రూరల్ మండలం

వలంటీర్ సేవలను మరువలేను



తణుకు టౌన్: మా వలంటీర్ కె చిన బాబు కోవిడ్ సమయంలో ఎనలేని సేవలందించారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఎవరూ తోటి మనిషిని పట్టించుకోని సమయంలో వలంటీర్ ఎప్పటికప్పుడు నా పరిస్థితిని గమనించి దాతలు అందించిన బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఇంటి వద్దకు తెచ్చి అందించారు. ప్రభుత్వ పథకాలను వైఎస్సార్ చేయూత, మూడు సార్లు పొందాను. వలంటీర్ చేసిన సేవలను ఎప్పటికీ మరువలేను.

– ఉన్నమట్ల నాగమణి, మండపాక, తణుకు రూరల్ మండలం

పథకాలను సకాలంలో అందించారు



మా వలంటీర్ బొంతు అన్నా రోజా మా కుటుంబానికి అర్హత ఉన్న అన్ని సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయడంతో మాకు లబ్ధి చేకూరింది. పథకాలు అందేలా చేశారు. మా ఇంటిని మనిషిలా ఎంతో సహాయంగా ఉంటున్నారు. మాకు ఇంటి స్థలం, పిల్లలకు అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన, వంటి పథకాలను ప్రభుత్వ కార్యాలయాలకు తిరిగే పనిలేకుండా అన్నీ అందేలా వలంటీరు కృషి చేశారు.

– పమ్మి సుజాత, మండపాక, తణుకు రూరల్ మండలం

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 35 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్ర సంచార వైద్యశాల ద్వారా తణుకు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు నల్లజర్ల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

38 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రతి నెలా 3వ ఆదివారం తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 38 మందికి ఉచితంగా బీపీ, సుగర్ నిర్ధారణ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. అవసరమైన మందులను అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ పీ సత్యనారాయణ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

పెంటపాడు: రోజురోజుకూ అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలను ప్రభుత్వం అదుపు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు శిరపరపు రంగారావు, నాయకులు బంకూరు నాగేశ్వరరావు, పెనగంటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



బంగారుగూడెం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారనే ఆలోచన ప్రతిపక్షాలు చేయడంలేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని బంగారుగూడెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గడపగడపకు వెళ్లిన సందర్భంలో ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మాట ఇచ్చిన ప్రకారం ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో తోపు అన్నట్టుగా చంద్రబాబుకు వత్తాసు పలికితే ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ముమ్మాటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతం కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తొలుత రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొను కుమాటి శేషలత, వైస్‌ఎంపీపీ సూర్పని రామకృష్ణ, సర్పంచ్ చుండ్రు తేజస్విని, ఎంపీటీసీ సభ్యులు బుర్ల సుబ్బలక్ష్మి, మార్లపూడి సుబ్బారావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, గుమ్మళ్ల తాతారావు, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, నూనె రాధాకుమారి, కొల్లా విజయలక్ష్మి, ములకాల రాంబాబు, తమ్మిశెట్టి చుక్కయ్య, చుండ్రు శ్రీనుబాబు, బుర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తోకతిపప గ్రామంలో ఆదివారం ఓ యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని 20 ఏళ్ల వయస్సున్న యువతి ఈ నెల 13న రాత్రి ఇంట్లో నిద్రపోయింది. తెల్లవారిన తరువాత తన కుమార్తె కనిపించకపోవడంతో ఆమె ఆచూకీ కోసం తండ్రి బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

భీమవరం అర్బన్: దెయ్యాలతిప్పలో ఆదివారం ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన నాగిడి తాతాజీ భీమవరం వెళుతుండగా రామాయణపురం వచ్చేసరికి అతనిపై మద్యం తాగి ఉన్న మైలపల్లి రాజేష్, రెడ్డి మణికంఠలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల, ప్రత్తిపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవీ శేషగిరి రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి జరిగే సమావేశాల్లో ప్రజలు పాల్గొని సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



ఉచిత నేత్ర వైద్యశిబిరంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని ఆర్యవైశ్య ప్రముఖులు పేరూరి కాశయ్య కొనియాడారు. క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో దాత పడాల మహేశ్వరరావు సహకారంతో నేత్ర వైద్య శిబిరం జరిగింది. నిడదవోలుకు చెందిన రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్య బృందం వారిచే 87 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ల నిమిత్తం 9 మందిని నిడదవోలుకు పంపారు. 22 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు. అధ్యక్షులు వంగపండు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చ వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆబోతుకు చికిత్స



గాయపడ్డ ఆబోతుకు వైద్యం చేస్తున్న వెటర్నరీ ఏడీ జనార్దనరావు

ఆకివీడు: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వెలంపేట వద్ద గాయపడిన ఆబోతుకు పశుసంవర్ధక శాఖ ఏడీ జనార్దనరావు వైద్య చికిత్స అందించారు. వివరాల్లోకి వెళితే.. ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని వెనుకకు నడుపుతుండగా, రోడ్డుపై పడుకున్న ఆబోతు కాలుపైకి టైరు ఎక్కడంతో తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు సపర్యలు చేసి, పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. ఏడీ జనార్దనరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆబోతు కాలుకు మందు వేసి కట్టుకట్టారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

'నాచు' మృతికి మోషేన్‌రాజు నివాళి

భీమవరం (ప్రకాశం చౌక్): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాచు సత్యనారాయణ (సత్యం) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆదివారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని మోషేన్‌రాజు గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపారు.

ప్రారంభమైన సార్వా వరి నాట్లు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో సార్వా వరినాట్లు ప్రారంభమయ్యాయి. ముందస్తు సార్వా సాగుకు సన్నాహాలు చేయాలని వ్యవసాయాధికారులు సూచించడంతో గునుపూడిలో వరినాట్లు వేస్తున్నారు. మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, గునుపూడి, అనాకోడేరు, కొమరాడ, రాయలం, చినఅమిరం, నరసింహపురం తదితర గ్రామాలలో సుమారు 8,900 ఎకరాలలో రైతులు సార్వా సాగు చేపట్టారు. ఇప్పటికే పొలాల్లో దమ్ములు, గట్టులంకలు సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందస్తుగా సార్వా సాగు వల్ల అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చే భారీ వర్షాలు, తుపానుల ధాటికి పంటను రక్షించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెబుతున్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు డీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకోవాలని కోరారు.

మరింత విస్తృతంగా కళాసేవ



నటరాజు స్వామికి పూజలు చేస్తున్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ):బీవీఆర్ కళాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కళాసేవలను మరింతగా విస్తృతం చేస్తామని బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు అన్నారు. పట్టణంలోని బీవీఆర్‌లో ఆదివారం రాత్రి కళాకారులతో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం ఘనంగా జరిగింది. కళాకారులచే ట్రాక్ సింగింగ్, కూచిపూడి నాట్యాచారిణి కె.ఆముక్తమాల్యద (విశాఖపట్నం) వారు ఇచ్చిన నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం ఆమెకు కళా సత్కారం చేశారు. ఎంవీఆర్ మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత ఎంఎల్ఎస్ఎన్ రెడ్డికి గౌరవ పురస్కారం, ప్రముఖ గాయకులు, రిథమ్‌ప్లేయర్, నరసాపురం పేద కళాకారుడు తోలేటి శ్రీనివాస్‌కు ఆర్థిక సత్కారం చేశారు. కార్యక్రమంలో పీటీ వెంకన్న, ఆళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



కాళ్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



భీమవరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కాళ్ల: కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల నడుమ సాగింది. దేశ, విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు అంతా తమతో చదివిన విద్యార్థులను కలిసేందుకు అందరూ ఒకచోటకు చేరారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. గురుశిష్యుల పవిత్ర బంధం గుర్తుకు తెచ్చుకున్నారు. పాఠశాలకు అవసరమయ్యే విద్యుత్, వైఫై, కుర్చీల ఏర్పాటు నిమిత్తం రూ.60వేలు విరాళం అందించారు. తమతో చదివిన 160 మంది పైబడిన విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్ ద్వారా అందర్నీ కలిపి ఒక వేదిక మీదకి చేరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం శ్రీ జూపూడి గంగయ్య మెమోరియల్ హైస్కూల్‌లో 1985–86 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా కలిసి గురువులను సత్కరించారు. స్కూల్‌కు అవసరమైన క్రీడా సామగ్రి, రూ.10 వేలు స్కూలు అభివృద్ధికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జూపూడి నాగ దమయంతి, ఎం.దేవేంద్రబాబు, జవ్వాది స్వామినాయుడు, సూదా బత్తుల కృష్ణమోహన్, కామన రాంబాబు, కె.తుల సీరామ్ (చెన్నయ్), కొండపల్లి భాస్కర్, బాపట్ల కిషోర్, పులపర్తి గోపాలం, ఎ.కాశీ విశాలక్ష్మి, పద్మ (చెన్నయ్) తదితరులు పాల్గొన్నారు.